


# సమరోజ్వల ఘట్టాలు





తెలంగాణ సాధనలో ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ అనేక సమరోజ్వల ఘట్టాలను ఆవిష్కరించింది. అణచివేతపై ధిక్కార బావుటాను ఎగురవేసింది. శాంతియుత పయనం సాగించింది. తెలంగాణ ఏర్పాటు ప్రకటించి, ఆ తర్వాత కేంద్రం యూటర్న్ తీసుకోవటంతో అప్పటిదాకా అనుసరించిన మార్గాలను కొనసాగిస్తూనే విప్లవాత్మక నిరసన పోరాటాలకు నాందిపలికింది. జాక్‌తో ఉమ్మడి కార్యాచరణను అమలు చేస్తూనే కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ సమయోచిత పోరాటాలను నెరపింది. రాస్తారోకోలు, రహదారుల దిగ్బంధాలు, మానవహారాలు, సాగరహారం, మిలియన్‌మార్చ్, సకల జనుల సమ్మె తదితరాలతో తెలంగాణ తల్లికి ఉద్యమం ప్రణమిల్లి రణం చేసింది. వంటావార్పులై తెలంగాణ వ్యతిరేకులకు ముద్దదిగని అనివార్యతలు సృష్టించింది. ఆత్మబలిదానాలతో ఎడతెగని దుఃఖాన్ని దిగమింగుతూనే దిగంతాలను ఏకం చేసింది. ఒక్కో సందర్భం ఒక్కో అధ్యాయంగా నూతన పోరాట చరిత్రను లిఖించింది. 2009 నుంచి 2014 జూన్ 2 వరకు తెలంగాణ రాష్ట్రాన్ని సిద్ధించే దాక అలుపెరుగని ఆత్మగౌరవాన్ని ప్రదర్శించింది.











మొత్తం తెలంగాణ బతుకు మారాలంటే 'ప్రత్యేక రాష్ట్రం ఒక్కటే పరిష్కారం' అని కేసీఆర్ నిర్ణయించుకున్నారు.

**జలదృశ్యం సాక్షిగా అస్తిత్వ పతాక**

అంతే అప్పటికే తెలంగాణలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, టీడీపీలో తన సహచరులు, పలువురు కాంగ్రెస్ నాయకులతో చర్చోపచర్చలు చేశారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్, ఆర్. విద్యాసాగర్‌రావు, పురుషోత్తమరెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, కేశవరావు జాదవ్, బియ్యాల జనార్దన్‌రావు సహా వివిధ రంగాల నిష్ణాతులతో సుదీర్ఘంగా మేధోమథనం జరిపారు. ఫలితంగా తెలంగాణ ప్రజల సామూహిక ప్రతీకగా కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ పురుడుపోసుకునే క్షణం వరకు తెలంగాణ ఐక్యవేదిక కార్యాలయంగా ఉన్న జలదృశ్యంను పార్టీ కార్యాలయంగా వాడుకోవడానికి కొండా లక్ష్మణ్ బాపూజీ ఇచ్చారు. అలా 2001 ఏప్రిల్ 27న జలదృశ్యంలో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ఆవిర్భవించింది. తెలంగాణ 10 జిల్లాల చిత్రపటంతో కూడిన గులాబీ రంగు జెండాను పార్టీ జెండాగా కేసీఆర్ ఎగురవేశారు. ఆ జెండాను తెలంగాణ తన గుండెకు హత్తుకున్నది. పార్టీ ఏర్పాటైన తొమ్మిది రోజుల్లోపే 19 లక్షల మంది సభ్యులుగా చేరారు. బీఆర్ఎస్‌ను తెలంగాణ అస్తిత్వ, ఆత్మగౌరవ పతాకగా భావించారని చెప్పటానికి అంతకన్నా పెద్ద సాక్ష్యం అక్కర్లేదు.